నమస్తే తెలంగాణ

# వరంగల్

3 | వరంగల్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | WARANGAL

## బలగం మొగిలయ్య ఇకలేరు

- అనారోగ్యంతో కన్నుమూసిన జానపద కళాకారుడు
- పలువురు ప్రముఖుల సంతాపం
- పాట రూపంలో బతికే ఉంటారు: కేటీఆర్

నర్సంపేట/దుగ్గొండి/కాశీబుగ్గ, డిసెంబర్19: బలగం సినిమాలో తన పాట ద్వారా తెలుగు రాష్ట్ర ప్రజల్లో చిరస్మరణీయమైన ముద్ర వేసుకున్న జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య(60) ఇక లేరు. బేడ బుడగ జంగాలకు చెందిన ఈయన తెలంగాణ ప్రాంతంలో శారద కథల ద్వారా తన పాటలతో అలరించారు. కొన్నేళ్లుగా కిడ్నీ, గుండె, సంబంధిత వ్యాధులతో బాధపడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. బలగం సినిమాలో క్లైమాక్స్ పాటలో 'తోడుగా మాతోడుండి.. నీడల మాతో నడిచి' అనే పాట ద్వారా కుటుంబంలో ఉన్న అనుబంధాలను ప్రతిబింబింపజేశారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య తన భార్య కొమురమ్మతో కలిసి జానపద కళాకారులుగా జీవనం సాగిస్తున్నారు. శారద తంబూరను ఆయన మీటుతూ గానం చేస్తుంటే డక్కి వాయిస్తూ కొమురమ్మ గానం చేస్తుంది. వారిద్దరూ కలసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, ఢిల్లీ, తదితర అనేక వేదికలపై ప్రదర్శన ఇచ్చారు. మొగిలయ్య మృతితో దుగ్గొండి మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. సినీ కళాకారుడు రచ్చరవితో పాటు జానపద కళాకారులు తరలివచ్చి నివాళులర్పించారు. మొగిలయ్య అనారోగ్య సమస్యను గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా నిమ్స్‌లో మెరుగైన వైద్యం అందించారు. అనంతరం దళిత బంధు కింద రూ. 10 లక్షలు ఇచ్చి ఆదుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సాయం అందించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవీంద్రభారతిలో తన తండ్రి సత్తయ్య స్మారక పురస్కారం అందించి గౌరవించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గత నెలలో రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. నిరుపేదలైన మొగిలయ్య కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి, వారి వారసత్వ వృత్తిని మరుగున పడకుండా శారద జానపద కళాకారులను ప్రభుత్వం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిళి, మాజీ సర్పంచ్ మేర్గు రాంబాబు, గుండెకారి రంగారావు, ఆరె జైపాల్‌రెడ్డి, బైగాని రఘు, కక్కెర్ల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయన పాటకు చలించని హృదయం లేదు

**మాజీ మంత్రి కేటీఆర్**

బలగం సినిమా మొగిలయ్య పాట రూపంలో బతికే ఉంటారు. ఆయన పాటకు చెమర్చని కళ్లు లేవని, చలించని హృదయం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. మొగిలన్న పాట తెలంగాణ బలగాన్ని మళ్లీ చాటిందని, మానవీయ కోణాన్ని ఆకాశమంతా ఎత్తులో నిలిపిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా బలగం పాటతో తెలంగాణ ప్రజల మనస్సుల్లో నిలిచిపోతారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నిర్మాత దిల్‌రాజు, బలగం డైరెక్టర్ వేణు తదితరులు సంతాపం తెలిపారు.

### బంధాలను గుర్తు చేసిన మొగిలయ్య

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి**

దేవరుప్పుల : మంట గలిసిన మానవ విలువలు, కుటుంబ బంధాలను గుర్తు చేసిన బలగం మొగిలయ్య మృతి తెలుగు జాతికి తీరని లోటు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తీసిన బలగం సినిమాలో మొగిలయ్య పాడిన పాట ప్రేక్షకులను ఏడిపించింది. దూరంగా ఉంటున్న వారు, కలహాలతో సతమతమవుతున్న కుటుంబాలు ఈ పాటతో ఒక్కటయ్యారు. చిన్న గొడవలతో ఏండ్ల తరబడి మాట్లాడుకోని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, కుటుంబ సభ్యులు తిరిగి దగ్గరయ్యారు. మానవ సంబంధాలు బతికున్నన్ని రోజులు మొగిలయ్య సజీవంగా ఉంటాడు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.

### వినోద్‌కుమార్ సంతాపం

హనుమకొండ: బలగం సినిమాతో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ జానపద కళాకారుడు మొగిలయ్య మృతికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంతాపం తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారని ఆయన పేర్కొన్నారు. మొగిలయ్య కుటుంబ సభ్యులకు వినోద్ కుమార్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే పెద్ది నివాళి..

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మొగిలయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాధిత కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మొగిలయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పాలన చేతకాక డైవర్షన్ రాజకీయాలు

### కేటీఆర్‌పై ఏసీబీ కేసును ఖండించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ, డిసెంబర్ 19 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించినట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయలేకపోవడంతో వస్తున్న ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపి పబ్బం గడుపుతోందని ఆరోపించారు. 2023లో దేశంలో అనేక నగరాలను కాదని హైదరాబాదును ఫార్ములా ఈ రేస్ కోసం ఎంచుకోవడం మనకు గర్వకారణం అన్నారు. ఈ రేస్ నిర్వహించిన న్యూయార్క్, లండన్, బెర్లిన్, బీజింగ్, వంటి ప్రముఖ నగరాల సరసన హైదరాబాద్‌ను నిలబెట్టింది కేటీఆరేనని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేవలం కక్ష సాధింపు దిశగా ఈ రేసును రద్దు చేసి ఇప్పుడు కేటీఆర్ మీద అక్రమ కేసులు నమోదు చేసి రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడడం రేవంత్‌రెడ్డి దుర్మార్గ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమంగా పెడుతున్న కేసులు అన్నింటిపై పోరాడుతున్న కేటీఆర్ అడ్డును తొలగించుకోవాలని ఇలాంటి నీచమైన పనులకు రేవంత్‌రెడ్డి తెరలేపి తాను రాక్షస ఆనందం పొందుతున్నాడని ఆరోపించారు. బ్రోకర్ మాటలు చెప్పే రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక ఫార్ములా ఈ రేస్ అనే కొత్త నాటకానికి తెరలేపి సమయాన్ని వృథా చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ అసెంబ్లీలో కేటీఆర్ అడ్డు ఉండకూడదని దుర్మార్గపు, నీచమైన చర్యకు పాల్పతున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా నీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు బంద్ చేసి ప్రజలకు బాగు చేసే పనులు చేయమని హితవు పలికారు. ఏదో కేటీఆర్‌ను కేసులో ఇరికించి సంబుర పడుతున్నావేమో కానీ న్యాయస్థానంలో నీకు మొట్టికాయలు తప్పవు తస్మాత్ జాగ్రత్త అని దయాకర్‌రావు హెచ్చరించారు.

## కేటీఆర్ గొంతు నొక్కే ప్రయత్నం

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

కృష్ణ కాలనీ, డిసెంబర్ 19: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గొంతు నొక్కేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడు. కేటీఆర్‌పై కేసు దుర్మార్గమైన, కక్ష సాధింపు చర్య. పూర్తిగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ శ్రేణులు శాంతియుతంగా ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రతి చర్యను ఎండగట్టాలి. నిజం నిలకడ మీద తెలుస్తుంది. శాసనసభలో చర్చిద్దాం రా అంటే రాకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముఖం చాటేయడం సిగ్గుచేటు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, మా కేటీఆర్ గళాన్ని న్యాయస్థానంలో వినిపిస్తాడు. కడిగిన ముత్యంలా బయటికి వస్తాడు.

## విన్నపాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

**ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్**

మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

హనుమకొండ, డిసెంబర్ 19: ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలు, సూచనలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులసంఘాల నుంచి 135కు పైగా వినతులు, అభ్యర్థనలు అందాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామన్నారు. అలాగే హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం సుబ్బయ్యపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీని జస్టిస్ షమీమ్ అక్తర్ అధికారులతో కలిసి సందర్శించి సౌకర్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, డీఎస్‌డీవోలు శ్రీలత, భాగ్యలక్ష్మి, సునీత, నర్సింహస్వామి, విక్రం, ఎస్‌డబ్ల్యూవోలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

## మిల్లు కార్మికులకు అండగా బీఆర్ఎస్

- నా ప్రాణం ఉన్నంత వరకు వారి పక్షాన నిలబడతా
- కార్మిక భవన్ నిర్మాణానికి మొదటి అడుగేస్తా
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

గిర్మాజీపేట, డిసెంబర్ 19 : అజంజాహి మిల్లు కార్మికులు, వారి కుటుంబాలకు తనతో పాటు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఒక కార్మికుడి బిడ్డగా తన ప్రాణం ఉన్నంత వరకు వారి పక్షాన నిలబడతానని భావోద్వేగంతో పేర్కొన్నారు. నగరంలోని అజంజాహి మిల్లు కార్మిక భవన్‌ను ఆక్రమించుకొని దానిని నేలమట్టం చేసిన నేపథ్యంలో గురువారం నరేందర్ శివనగర్‌లోని తన ఇంటివద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజంజాహి కార్మిక భవన్ స్థలం ఆక్రమించుకున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ చర్యలు తీసుకొని వారిపై చార్జిషీట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు నాయకులు వారే దగ్గరుండి ఈ తతంగం నడిపి, మళ్లీ అతడే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పడం హేయమన్నారు. గతంలో వర్ణం షాపింగ్‌మాల్‌ను ఎందుకు కూల్చారు? బేరం కుదరడంతోనే ఇప్పుడు ఇబ్బంది పెడతలేరా? అంటూ సూటిగా ప్రశ్నించారు. కార్మిక భవన్ కూల్చిన స్థలం వద్ద కొబ్బరికాయ కొట్టిన సదరు నేత ప్రస్తుతం ఆ విషయాన్ని దూరం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దానికి కారణం బేరం కుదరకనా లేదా ప్రతిపక్షాలు, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నదనా? అని అడిగారు. కార్మిక భవన్ స్థలాన్ని ఎవరు అమ్మితే ఈ బట్టల షాపు యజమాని కొన్నారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్మికుల స్థలం ఆక్రమించుకున్న వారి వెనకాల ఉన్న దొంగలెవరు? ఎవరు దీనిని ప్రోత్సహిస్తున్నారు? ఎవరు ఆ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారు? అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో కొండా మురళి స్పష్టతలేని మాటలు మాట్లాడారని, తూర్పు నియోజకవర్గంలో కబ్జాలకు పాల్పడేదెవరో ప్రజలందరికీ తెలుసన్నారు. కార్మికుల స్థలంలో కార్మిక భవనం కట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్మిక భవన్ నిర్మాణానికి తానే మొదటి అడుగు వేస్తానని నరేందర్ తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ తుమికి రమేశ్‌బాబు, కుందారపు రాజేందర్, కొంతం మోహన్, ఆర్టీఏ మాజీ సభ్యుడు గోరంట్ల మనోహర్, మహిళా నాయకురాలు సింగిరెడ్డి యశోద, నాయకులు పాల్గొన్నారు.

- అజంజాహి మిల్లు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయొద్దు
- వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఆదేశాలు
- విమర్శలు నేపథ్యంలో భూ వివాదంలో కీలక మలుపు

## కార్మిక భవన్ కబ్జాపై కదలిక

*'నమస్తే' కథనాలతో స్పందించిన అధికార యంత్రాంగం*

కాశీబుగ్గ, డిసెంబర్ 19 : వరంగల్ నగరంలోని అజంజాహి మిల్లు కార్మిక భవన్ కూల్చివేతపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇటీవల కార్మికులకు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేసి అందులో ప్రైవేట్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేసిన విషయమై 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన వరుస కథనాలకు అధికార యంత్రాంగం స్పందించి చర్యలకు ఉపక్రమించింది. ఈమేరకు గురువారం వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ ఆ స్థలాన్ని పరిశీలించి ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టంచేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా తహసీల్దార్ కీలక ఆదేశాలు జారీ చేయడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు మొదలైంది.

కార్మికుల భవన స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ ఇక్బాల్

మాట్లాడుతున్న కొండా మురళీధర్‌రావు

## ఆ భవనం కార్మికులకే చెందాలి

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు**

కాశీబుగ్గ, డిసెంబర్ 19 : అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవనం పేద కార్మికులకే చెందేలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. గురువారం కాశీబుగ్గ ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ తూర్పు ప్రజల నమ్మకంతోనే బీసీ నాయకుడిగా ఎదిగానని, 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడూ భూముల కబ్జాలకు పాల్పడలేదని చెప్పారు. కాసం ఓం నమఃశివాయ తన షాపింగ్ మాల్ నిర్మాణం కోసం హైదరాబాద్‌లో కలిసి వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందని చెప్పి ఆహ్వానిస్తేనే శంకుస్థాపనకు వెళ్లానని తెలిపారు. తాను ఎప్పుడూ కార్మికుల పక్షమేనని చెప్పారు. అజంజాహి గ్రౌండ్‌లోని కార్మిక భవనం స్థలం కూడా పరిధిలో లేదని రికార్డులు చూపుతున్నాయని తెలిపారు. భవనం కబ్జా వ్యవహారంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. కార్మికుల ఆశయం మేరకు అదే స్థలంలో కార్మిక కమిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. పేదలను ఆదుకోవడమే తప్ప కబ్జాలకు పాల్పడడం కొండా మురళి చరిత్రలో లేదని తెలిపారు. మిల్లు భూముల జోలికి వెళ్లిన వాళ్లందరూ నష్ట పోతారని హెచ్చరించారు. వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌ను ఆదేశించినట్లు తెలిపారు. పూర్తి విచారణ చేపట్టిన తర్వాతే నిర్మాణం చేయాలన్నారు. అవసరమైతే కార్మికులకు స్థలం కొనుగోలు చేసి భవనం నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మిల్లు రిటైర్డు కార్మికులు, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

### కొండా మురళికి చిత్తశుద్ధి ఉంటే

## కార్మిక భవనం నిర్మించాలి

- టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేయాలి
- రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు

కాశీబుగ్గ, డిసెంబర్ 19 : అజంజాహి మిల్లు కార్మికుల భవనం స్థలంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ వెంటనే నిధులు మంజూరు చేయించి కార్మిక భవనాన్ని నిర్మించాలని మాజీ మేయర్ డాక్టర్ టీ రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కాశీబుగ్గ ఓసిటీలోని ప్రదీప్‌రావు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీపురావుతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి వాటిని కాపాడే బాధ్యతను జిల్లా యంత్రాంగం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుకోలేని జిల్లా యంత్రాంగం ప్రజలను ఏమి కాపాడుతుందని అన్నారు. హైడ్రా పేరుతో అనుమతి ఇచ్చిన వాటిని కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అండదండలతోనే నగరం నడిరోడ్డున కార్మికుల స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వంలో ఉన్న అధికారులు స్పందించాలని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు ఎలా పేరు మార్చారని ప్రశ్నించిన ఆయన అనుమతులను ఇచ్చిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థలం యజమాని రాజిరెడ్డికి వారసులు లేరని తెలిపారు. వెంటనే మంత్రి కొండా సురేఖ స్పందించి కార్మిక భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి అక్రమాలు పునరావృతం కావని తెలిపారు. వస్త్ర వ్యాపారితో వెంటనే ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అన్యాయం జరిగితే తాము ముందుండి ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వంగాల సమ్మిరెడ్డి, సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, పోలెపాక మార్టిన్ లూథర్, గడల కుమార్‌యాదవ్, మామిడి సతీశ్ కట్టర్, కొమాకుల నాగరాజు, కనుకుంట్ల రంజిత్, ఎరుకల రఘునాథరెడ్డి, కందిమల్ల మహేశ్, రత్నం కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదులకు రూ.178 కోట్లు కేటాయించండి

- తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపండి
- అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : 'దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రూ.178 కోట్లు కేటాయించండి..499 ఎకరాలకు మీరు ప్రొక్యూర్ చేస్తే జనగామతో పాటు కింద ఉన్న ఆలేరుకు పూర్తిగా నీళ్లు వస్తాయి.. వెంటనే నిధులు రిలీజ్ చేసి పనులు ప్రారంభించండి.. జనగామ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది' అని గురువారం అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నాలుగు మోటర్లు ఆన్‌చేసి వెంటనే చెరువులు నింపాలని కోరారు. ఇంతకు ముందు భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో సమస్యలు తెలిపానన్నారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఎక్కువ భాగం జనగామ నియోజకవర్గంలోనే ఉంటుందని, పలు ప్యాకేజీల్లో మిగిలిన 499 ఎకరాల భూమిని ప్రొక్యూర్ చేసి రూ. 178 కోట్లు కేటాయించి పనులు పూర్తిచేస్తే జనగామ, ఆలేరు ప్రాంత రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇటీవల ఆలేరు ఎమ్మెల్యే తపాస్‌పల్లి నుంచి నీళ్లన్నీ తీసుకెళ్లడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడుతున్నదన్నారు. ప్రస్తుతం జనగామ జిల్లాలోని 484 చెరువులు నింపేందుకు అంతా సిద్ధంగా ఉందని, ధర్మసాగర్ నుంచి గండిరామారం, అక్కడి నుంచి తపాస్‌పల్లి సహా మొత్తం రిజర్వాయర్లు నింపుకుంటే యాసంగి పంటలకు ఇబ్బందులుండవన్నారు. అధికారులు కూడా ఏ చర్యలు తీసుకోవడం లేదని, నాలుగు పంపులుంటే ఒక దానిని మాత్రమే నామమాత్రంగా నడుపుతున్నారని, అన్నింటిని ఆన్ చేసి మెజారిటీ చెరువులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలివ్వాలి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 70వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం శాసనమండలిలో ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అంగన్‌వాడీల వేతనం రూ.4200 మాత్రమే ఉండేదని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా రూ.7వేలు, రూ.10,500, రూ.13,650 వరకు పెంచినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నుంచి ఏడు లక్షల మంది చిన్న పిల్లల చదువు కోసం కేంద్రాలు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మినీ అంగన్వాడీను తీసివేసిందన్నారు. అలాగే సెంటర్ల అద్దె, కూరగాయలు, గ్యాస్ తదితర నిత్యావసర సరుకులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి చెల్లించడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు కూడా మూడు, నాలుగు నెలలకోసారి ఇవ్వడం వల్ల ఆ భారం పిల్లలపైనా పడి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సూపర్‌వైజర్ పోస్టుల కోసం రాత పరీక్ష లేకుండా సీనియార్టీ ప్రకారం నియమించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.18వేల నుంచి రూ.26వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలుచేయలేదని గుర్తుచేశారు. అంగన్వాడీల రిటైర్మెంట్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినా అమల్లోకి రాలేదన్నారు. అంగన్వాడీ కేంద్రాల ఇంటి అద్దె, నిత్యావసర సరుకులతో పాటు వేతనాలను ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ అంగన్వాడీల సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## 32 మందిపై చీటింగ్ కేసు

- మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్ బాధ్యులపై చర్యలు

నమస్తే ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 19: చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్‌పై 32 మందిపై చీటింగ్ కేసు నమోదైంది. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో ఆగస్టు 24వ తేదీన నాలుగెకరాల భూమిని రూ.2.35 కోట్లతో మార్కెట్ రేటు కన్నా అధిక ధరకు కొనుగోలు చేసి అవకతవకలకు పాల్పడిన విషయాన్ని 'నమస్తే తెలంగాణ' అక్టోబర్ 25వ తేదీన వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల నుంచి రెండు విడతల్లో రూ.48 లక్షలు రికవరీ చేయించారు. సెర్ప్ అదనపు డీఆర్డీవో బోనగిరి శ్రీనివాస్‌తో పాటు డీపీఎం (ఐబీ అండ్ బీఎల్) దాసరి సమ్మక్కను సస్పెండ్ చేశారు. అనంతరం నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో వసంతను కలెక్టర్ ఆదేశించడంతో జనగామ అర్బన్ పీఎస్‌లో ఐటీవల ఫిర్యాదు చేసింది. గురువారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుధ, కార్యదర్శి ప్రవంతి, కోశాధికారి చైతన్య, అకౌంటెంట్ మహేశ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కందగట్ల అశోక్, కీర్తి లక్ష్మి నర్సయ్య, వీరేందర్‌తో పాటు బాధ్యులైన మరో 25 మందిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఏసీపీ పార్థసారథి ఒక ప్రకటన విడుదల చేశారు. మరికొంతమందిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. నిధుల అవకతవకలపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వరుస వార్త కథనాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మహిళా సమాఖ్యల్లో సంచలనం కలిగించాయి. ప్రస్తుతం చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్యలో 1,26,922 మంది సభ్యులు వాటాదారులుగా ఉన్నారు. వీరికి సంబంధించిన రూ.2.35 కోట్ల పక్కదారి పట్టిన వి